# తాతయ్యా హనీమూన్

సీతారామయ్యగారు విసురుగా లేచాడు పడక్కుర్చీలోంచి. గబగబా వంకెకు తగిలించిన చొక్కా తీసి తొడుక్కున్నాడు. అలా తొడుక్కుంటుంటే కోడలు పక్క చూపులు చూస్తూ యింకా కిసుక్కున నవ్వుతున్నట్లే అనిపించింది.

ఆ నవ్వు తనని కాదన్నట్లు ఒక్కసారి భుజాలు విదిలించుకుని బయటకు అంగ వేశాడు. అలా వేస్తుంటే అల్లంత దూరంలో ట్రాన్సిస్టరు కన్పించింది. కాలితో ఒక్క తన్ను తన్నాలనుకున్నాడు.

అయినా సీతారామయ్యకు ఎంత కోపం వచ్చినా యిలాంటి వస్తువులమీద చూపించడు సహజంగా. కారణం కోపం తగ్గగానే చెడిపోయిన వస్తువు బాగు చేయించాల్సిన ఖర్చు కళ్ళ ముందు కదులాడి ఎలాంటి కోపమైనా మంచులా విడిపోతుంది. అయితే యీ రోజు అతడి కోపాన్ని ట్రాన్సిస్టరు తప్పించుకో గలిగినా తలుపులు తప్పించుకోలేక పొయ్యాయి.

"తాతయ్యకు కోపం వచ్చినట్లుంది". .... చిన్నగా అంటున్నాడు పదేళ్ళ మనవడు తనకంతా అర్థమైపోయినట్లుగా సన్నగా నవ్వుతూ.

"ఉష్ వూరుకో...." చిన్నగా కోడలి మందలింపు.

సీతారామయ్యకు ఆ పళాన వాడి చెవులు పట్టుకుని మెలిపెట్టి ఆ చెంపా, యీ చెంపా వాయించాలనిపించింది. కానీ వాడిమీద చెయ్యెత్తితే కోడలు చేసే రభస గుర్తు వచ్చి కోపాన్ని దిగమింగుకుని బయట పడ్డాడు యాభై ఏళ్ళ సీతారామయ్యగారు.

రానయితే బయటకు వచ్చాడు గానీ- ఆదివారం మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటి పదిహేను నిముషాలు కావస్తున్న సమయంలో ఎక్కడికి పోవాలో ఆయనకు తోచలేదు. అందుకే రెండు నిముషాలు వీధి మొగదలలో నిలబడి ఆ తర్వాత గబగబా మిత్రుడు గోపాలయ్య యింటికి నడిచాడు.

వీధి వాకిట్లోనే ఎదురైంది గోపాలయ్య మనుమరాలు. "మా తాతయ్య, అమ్మమ్మ అదేదో దేవుడు సినిమాట..... పదకొండు గంటల ఆటకు వెళ్ళారు" అంటూ వార్త అందించింది.

వెళ్ళాడూ?.... వెళ్తాడు.... వెళ్తాడు.... ఎందుకు వెళ్ళడూ. అందరూ ఎంత వయస్సు వచ్చినా చిలకా గోరింకల్లా బయటకు వెళ్తూనే వుంటారు. తనకే శాపం యిది! ఎప్పుడయినా ఒంటరిగా భార్యతో కన్పిస్తే సరి పరిహాసాలు, నర్మగర్భంగా నవ్వుకోడాలూనూ.

అసలు యీ పేపర్ల వాళ్ళంతా అత్తగారి చేతుల్లో ఆరడిపడుతున్న కోడళ్ళను గురించి కాటికాయలంత అక్షరాలతో రాస్తుంటారు. మరి కోడళ్ళ చేతిలో ఆరడి పడుతున్న తమలాంటి వాళ్ళ మాట ఎవ్వరూ పట్టించుకోరేం?

సీతారామయ్య ఆలోచిస్తూ నడుస్తున్నాడు. వీధి టర్నింగులో సిటీ బస్సు హారను విన్పించి తలెత్తి చూశాడు.

అక్కడికి దగ్గర్లోనే ఆగింది ఆ బస్సు. మరేమీ ఆలోచించకుండా గబగబా వెళ్ళి లోపలికెక్కేశాడు. తోచిన సినిమా హాలు పేరు చెప్పి టిక్కెట్టు కొన్నాడు.

బస్సు నిండా జనం కిటకిటలాడుతున్నారు. 'ముందుకు జరగమని' కండక్టరు హెచ్చరికలు. బస్సులో నిలబడ్డాడన్న మాటేగానీ అతడి మనసులో యిందాక రేడియోలో ఎవరో వేసిన ఆ ప్రశ్న. వింటూనే పెద్ద కోడలు నవ్విన నవ్వు గుర్తు వచ్చి వొంటికి కారం రాసుకున్నట్లుగా వుంది. ఒళ్ళు కంపరమెత్తి జలదరించింది కూడా.

ఇంతలో ఏదో టర్నింగు వచ్చింది కాబోలు-బస్సు ఒక్క కుదుపు కుదిపింది. పడబోయి తమాయించుకున్నాడు. హాంక్కు పట్టుకున్న చెయ్యి నొప్పిగా వుంటే చెయ్యి మార్చుకుంటుండగా- "పొయ్యేకాలం కాకపోతే- తల నెరిసిన వాళ్ళకు మాయదారి బుద్ధులేమిటి?.... వయసు రాగానే సరా. దున్నపోతుకూ వస్తాయి ఏళ్ళు.... పెద్ద బుద్ధులు లేక పొయ్యాక మనిషికీ, మానుకీ తేడా ఏముంది ?...."

ఆ తిట్లవర్షం ఏమిటో, ఎవరికో అర్థం కాక వులిక్కిపడి చూశాడు సీతారామయ్య. ముప్పయి ఏళ్ళ వయస్సుంటుందేమో ముందు నిలబడ్డ మనిషికి తల తిప్పి తన ముఖం మీదనే తిడ్తోంది, అందరూ తన వైపే చూస్తున్నారు.

ముందు అర్థంకాలేదు సీతారామయ్యకు. తర్వాత తట్టింది ఆ ట్యూబ్‌లైటుకు. బహుశా తను చెయ్యి మార్చుకునేటప్పుడు ఆవిడ వొంపు సొంపుల దగ్గర చెయ్యి తగిలింది కాబోలు.

తల కొట్టేసినట్లయింది అతడికి. పిల్లిలా ముడుచుకుపోయి ఒక మూలగా వొదిగి నిలబడ్డాడు. మనసులో మాత్రం "మరీ

"అంత అపూర్వం పశ్యవు సిటీ బస్సులో ఎందుకెక్కావు తల్లీ" అనుకున్నాడు. ఏమయినా బస్సులో వాళ్ళ ముసిముసి నవ్వులు చూసి అందులో నిలబడాలనిపించలేదు. అందుకే తను దిగాల్సిన స్టాపు కాకపోయినా, బస్సు ఆగిన చోట దిగిపొయ్యాడు.

ఇంకా కొంత దూరం పోతేగానీ, సినిమా హాలు రాదు. ఈ కాస్త దూరానికి రిక్షా ఎందుకు నడవవచ్చులే అనుకున్నాడు. ఇంతలోనే అనిపించింది. రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించి తన సుఖాలు మానుకుని కూడా వీళ్ళకు పెడుతుంటే తనకు వొరుగుతున్నదేమిటి? విసుర్లు, కసుర్లు, ఎగతాళి, హేళన!

సీతారామయ్య ఎదురుగా వస్తున్న రిక్షాను ఆపి చటుక్కున ఎక్కేశాడు జన్మలో తొలిసారిగా. అతడు అడిగినంత బాడుగ యిచ్చేసి లోపలకు వెళ్ళిన సీతారామయ్య అలవాటు ప్రకారం తను మామూలుగా కొనే కుర్చీ టిక్కెట్టు కొనబోయి అంతలోనే మనసు మార్చుకుని బాల్కనీ టిక్కెట్టు తీసుకున్నాడు.

ఆట మొదలెట్టి చాలా సేపయినట్లుంది. హాలంతా నిండి వున్నారు జనం. చివరికి గేటుకీపరు చూపించిన ఒక్కగా నొక్క ఖాళీ సీటులో కూర్చుని బాల్కనీ టిక్కెట్టును కొన్న ప్రివిలేజిని, ఆనందాన్ని తొలిసారిగా అనుభవిస్తూ కూర్చున్నాడు పది నిముషాలు.

ఎదురుగా తెరమీద నాయికా నాయకులు వర్షంలో తడుస్తూ డ్యూయెట్ పాడుకుంటున్నారు. నాయకుడు- నాయకి శరీరంలోని అన్ని భాగాలనూ తడుముతుంటే సీతారామయ్యకు ఏదోలా అనిపించింది. ఇలాంటి సినిమాలు తీసి తనలాంటి వాళ్ళ ప్రాణం తీస్తున్నారు అనుకుంటూ విలాసంగా వెనక్కి వాలబొయ్యాడు. అతడి చెయ్యి పొరబాటున పక్క కుర్చీలో కూర్చున్న పాతికేళ్ళ పడతికి తగిలింది

గజగజ లాడిపొయ్యాడు సీతారామయ్య. హడలి పోయి కుర్చీలో ఒక మూలకు వొదిగి భయంగా చూశాడు. ఆ మసక వెల్తురులో 'సిగ్గులేదూ. ముసలితనం వస్తున్నా చిన్న బుద్ధులు పోలేదు.' అంటున్నట్లుగా అనిపించింది. ఇంకా

# అధరాపురపు తేజోవతి




నయం పైకి అనేసి హాల్లో రచ్చచెయ్య లేదు అనుకున్నాడు.

నా ఖర్మ. సినిమాకు వెళ్ళినా శనేశ్వరం తప్పలేదు అనుకుంటూ చివాలున లేచి బయటకు వచ్చి నిలబడ్డాడు.

అంత ఆలస్యంగా వచ్చి హాల్లో పది నిముషాలు కూడా కూర్చోకుండా బయటకు వచ్చి నిలబడ్డ అతడ్ని అల్లంత దూరంలో వున్న గేటు కీపరు చిత్రంగా చూస్తున్నాడు.

కనీసం ఒంటి గంటన్నరదాకా కాలం గడుస్తుంది కదానని బోలెడు డబ్బుపోసి కొన్నాడు. మామూలుగా వెళ్ళే కుర్చీకి వెళ్ళినా బాగుండేది. సుఖం లేకపోయినా సినిమా అయినా దక్కేది .... అనుకుంటుండగా యింటర్వెల్ యిచ్చారు. సీతారామయ్య సరాసరి టీ స్టాల్ దగ్గరకు వెళ్ళి టీ తీసుకుంటుండగా వెనుక నుంచి వచ్చి ఒక చెయ్యి బలంగా భుజం మీద

పడింది. తుళ్ళిపడి తిరిగి చూశాడు సీతారామయ్య. మీద పడిన టీని తుడుచుకుంటూ. "బాగున్నావా?" వెనక నిలబడి నవ్వుతున్నాడు సమ వయస్కుడు డాక్టర్ బాలకృష్ణ.

"నువ్వా! ఎవరో అనుకున్నాను" అంటూ మరో కప్పు టీ అందుకుని అతడికిచ్చాడు.

డాక్టర్ బాలకృష్ణ, సీతారామయ్య ఒకటో క్లాసు నుంచి ఎస్సెల్సీ దాకా క్లాస్‌మేట్స్. ప్రాణ స్నేహితులు కూడా. ఇళ్ళు కూడా పక్కపక్కనే వుండేవి. అయితే ఎస్సెల్సీతో చదువు ఆపేసి వుద్యోగం చూసుకున్నాడు సీతారామయ్య. బాలకృష్ణ చదువు పూర్తిచేసి వున్నవూళ్ళోనే ప్రాక్టీసు పెట్టాడు. అయితే ప్రాక్టీసు పెట్టాక వాళ్ళు ఆ పేటనుంచి యిల్లు మారడంతో ఎక్కువగా కలుసుకునే అవకాశం లేదు. అయినా అరమరికలు లేని [illegible]ళ్ళ స్నేహం నిజంగా అపురూపమైంది

టీకి డబ్బులిచ్చేసి యివతలికి వస్తూ "నువ్వు కూడా పిక్చరుకు వచ్చావా?" అని అడిగాడు సీతారామయ్య.

"అవున్నా. ఈ హాలు వోనరు నా పేషెంటు. ఏ పిక్చరు వచ్చినా రమ్మని ఫోను చేస్తుంటాడు. ఎప్పుడొచ్చి ఎప్పుడు వెళ్ళినా అడిగేవాళ్ళు లేరు. అందుకని రౌండ్స్ చూసుకుని యింటికి వెళ్తూ కాసేపు కూర్చుని వెళ్తుంటాను. అవునూ.... నువ్వు గానీ పిక్చరుకు వచ్చావేమిటి? హాల్లో కనబడలేదే...." అన్నాడు బాలకృష్ణ.


సీతారామయ్య చిన్నగా నిట్టూర్చాడు.

"అదో పెద్దకథ. తర్వాత చెబుతాను కానీ ముందు నువ్వు డిస్పెన్సరీకి ఎన్నింటికి వస్తావో చెప్పు నీతో మాట్లాడాలి" అన్నాడు.

"ఇవ్వాళ ఆదివారం. సాయంత్రం డిస్పెన్సరీ వుండదు కానీ నువ్వు మాట్లాడాలనుకుంటే డిస్పెన్సరీకే రావాలా ఏమిటి? యింటికి రాకూడదూ?"

"అయితే సరే నేను సరాసరి ఇంటికి వెళ్ళి కూర్చుంటాను. నువ్వు పిక్చరు చూసిరా మాట్లాడుకోవచ్చు" అన్నాడు.

"నీ మొఖం. నువ్వంత అర్జంటుగా మాట్లాడాలనుకుంటే యిద్దరం యింటికి వెళదాం. పిక్చరు ఎక్కడికి పోతుంది.




మరోసారి చూసుకోవచ్చు" అంటూ అప్పటికప్పుడు రిక్షా పిలిచి సీతారామయ్యను ఎక్కించాడాయన.

బాలకృష్ణగారు భోజనం చేసి వచ్చే దాకా మేడమీద ఆయన గదిలో హెల్త్ మేగజైన్సు తిరగేస్తూ కూర్చున్నాడు సీతారామయ్య.

బాలకృష్ణగారు భోజనం చేసి వక్కపొడి డబ్బా పట్టుకుని వచ్చారు. "ఇప్పుడు చెప్పరా నాయనా. యిందాకటి నుంచి సస్పెన్సుతో చంపుతున్నావు నన్ను" అన్నాడు తను కొంచెం వేసుకుని, వక్కపొడి డబ్బా సీతారామయ్య ముందుకు నెడ్తూ.

సీతారామయ్యకు క్షణంసేపు ఏం చెప్పాలో తోచలేదు. ఆ తరువాత అన్నాడు :

"మరి మనిషి యింపోటెంట్‌గామారేందుకు యింజక్షన్సు ఏమన్నా వుంటాయా?"

బాలకృష్ణ ఒక్కసారి వులిక్కిపడ్డాడు.

"ఎందుకూ?" అన్నాడు ముఖంలోకి పరిశీలనగా చూస్తూ.

అతడి చూపులు తప్పించుకోడానికి తల వంచుకుని, "ఎందుకేమిటి. కావలసి వస్తేనేగా అడిగేది" అన్నాడు.

"యూ ఫూల్ నీకు మతిగానిపోయిందా ఏమిటి? మరో దానికి మందులు కోసం వస్తారు అందరూ మా దగ్గరకు. నీకేమిటి? చిన్నప్పటినుంచి కాయ కష్టం చేసి పరిపూర్ణమైన ఆరోగ్యంతో వున్న వాడివి నీకేమి ఖర్మరా!"

చిన్నప్పుడే తండ్రి పోవడంతో వున్న కొద్ది ఆస్తితో సంసారం మొత్తం ఈదుకు రావలసివచ్చేది. అందుకే యింటికి కావలసిన నీళ్ళు మొయ్యడం, కట్టెపేళ్ళు కొట్టడం, కూరలకని పెద్ద బజారుదాకా నడిచి వెళ్ళడం ఇలా కష్టపడేవాడు. ఇప్పటికీ అదే పద్ధతి. అదే నా ఖర్మ అయింది అనుకుంటూ.

"ఒరేయ్ నీకేంతెలుసు. ఈ ఆరోగ్యం మూలంగా నేనెన్ని అవమానాల పాలవుతున్నానో. ఎన్ని హేళనలు భరిస్తున్నానో....నా బాధ భగవంతుడి కూడా అర్థం కాదురా" అన్నాడు సీతారామయ్య.

ఇంతదాకా తమషాగా తీసుకున్న బాలకృష్ణగారు కొంచెం ముందుకు జరుగుతూ "ఫిక్సెడ్ డిపాజిట్ కాకుండా కొంప దీసి కరెంట్ ఎకౌంటు ఏమన్నా వోపెన్ చేశావేమిట్రా? అంటే అయిమిన్ ఎక్స్‌ట్రా మారిటల్. ఆఫ్‌కోర్సు నువ్వలాంటి వాడివి కావని నాకు తెల్సనుకో అయినా...." అర్థోక్తిలో ఆపాడు.

"చచ్చినట్టేవుంది! కట్టుకున్న పెళ్ళాంతో కలిసి కనబడితేనే కాకులు పొడిచినట్టు పొడుస్తున్నారు. ఎద్దేవాలు తప్పటంలేదు. ఇక కరెంటు ఎకౌంటు ఒకటే తక్కువ! ఒరేయ్ కృష్ణా నా బాధ నీకు తెలియదురా- ఆ యింజక్షన్లేవో యిచ్చి పుణ్యం కట్టుకో- నా పరువు కాపాడు" అన్నాడు.

ఆ స్వరంలో అభ్యర్థన విన్న బాలకృష్ణగారికి ఆశ్చర్యం వేసింది. "అసలు




ఏం జరిగిందో చెప్పు రాముడూ" అన్నాడాయన.

సీతారామయ్యకు రాత్రి జరిగిన సంఘటన గుర్తు వచ్చింది. బుద్ధి తక్కువై తను భార్యను లేవదమేమిటి అదు నెలల కోసారి భార్యను దగ్గరకు తీసుకుంటే-అదీ ఎక్కడో దూరంగా పాతసామాను పడేసే షెడ్డులో నుంచి వస్తుంటే అది ఆ కోడలి తమ్ముడు కంటపడటమేమిటి పైగా అదేదో పెద్ద యిదయిన విషయంలా అక్కకు చెప్పడం-ఆవిడ ఎటిక మీదా, పిల్లమీదా పెట్టి చేస్తున్న ఎగతాళి, హేళన దీనికితోడు రేడియోలో ఎవరో 'ఈ పెద్ద నాళ్ళకిలా బొమ్మ్యకాలం ఏమిటి?' అంటూ ప్రశ్నవేస్తే కోడలు, ఆమెతమ్ముళ్ళే కాకుండా- పదేళ్ళ పసివాడు మనవడు కూడా తనవైపు చూసి నవ్వడం. తర్వాత జరిగిన విషయాలూ అన్నీ పూసగుచ్చినట్లు చెప్పాడు సీతారామయ్య.

చివరికి, "బాలకృష్ణా నిజంగానే పెద్దతనంలో ఇలాంటి శారీరకమైన వాంఛలు పెట్టుకోకూడదు. నేనూ వొప్పుకుంటాను. మన వాళ్లు అందుకే వానప్రస్థం అన్నారు. బాగానే వుందికానీ- తీరవలసిన వయసులో కోరికలన్నీ తీరిన వాళ్ళు కొంత వయసు వచ్చాక విషయ వాంఛలకు దూరంగా వుంటారు కానీ నా విషయం నీకు తెలుసు. ఆ రెండు గదుల యింట్లో అంత మందితో కలిసివుంటూ పెళ్ళయినా బ్రహ్మచర్యమే ఎక్కువ చేశానురా నేను" అన్నాడు సీతారామయ్య.

అతడికి తన పెళ్ళయిన రోజులు గుర్తు వచ్చాయి. ఆ యింట్లో ముందు హాల్లో తల్లీ, మిగతా పిల్లలూ పడుకునే వాళ్లు. అందరి భోజనాలు అయ్యాక వంట ఇల్లు తుడిచి అప్పుడు మంచం వేసేది జానకి. ధనబలం లేకపోయినా బంధుబలగం ఎక్కువే వాళ్ళకు. ఎప్పుడూ ఎవరో ఒకరు పదకొండు పన్నెండు గంటల దాకా భోజనానికి వచ్చేవాళ్లు కారు. ఇంచుమించు ప్రతి రోజూ వాళ్ళకుఅన్నం పెట్టడానికి ఎదురు చూస్తూ భార్య గడప మీద తల పెట్టుకుని నిద్రపోతే తను పంచలో కునికిపాట్లు పడుతుండేవాడు. ఒక్కోసారి ఆ కోపంతో చలికాలంలో దుప్పటి కూడా లేకుండా అరుబయటే పడుకునేవాడు.

పైగా వాళ్ళకు యిరుగూ, పొరుగూతో మహాసఖ్యం. ఆ వీధిలో ఎవరింటికి చుట్టాలొచ్చినా ఆమె తమ ముందు గదిని వుదారంగా వాళ్ళకిచ్చేసి తనూ ఆడపిల్లలూ కోడలితో సహా వంటింట్లో పడుకుంటే తను తమ్ముళ్ళతో పంచలో కాలం గడిపేవాడు. వీటికి తోడు ఎవరెవరివో మిరపకాయల బస్తాలు, మినుములు, పెసలు. వడ్ల బస్తాలన్నీ తమ యింట్లో పడేయించేది మంచం వేసే సందుకూడా లేకుండా. మళ్ళీ సీతారామయ్యకు పంచపాళియే శరణ్యం.

అలా గడిచింది అతడి దాంపత్య జీవితం. అంతా చెబుతూ, "కృష్ణా అసలు శారీరకమైన సంతృప్తి అనే కాదురా. నీకెలా చెప్పాలో నాకు తెలియటం లేదు కానీ, మనసు కూడా!! అంటుంటే"

అవును రాముడూ నాకు తెలుసు. నేను అర్థం చేసుకోగలను. ముఖ్యంగా ఈ వయసులో నేను ఎందుకూ పనికిరాని వాడ్ని. నేను ఎవరికీ అక్కర లేదు అయామ్ అన్‌వాంటెడ్. ఇలాంటి ఫీలింగ్స్ రాకుండా ఒక విధమైన ఎస్యూరెన్సు కోసం సగం పాకులాడే మనిషి" అన్నాడు.

"మరి యితరులెందుకురా అర్థం చేసుకోలేరు?!" బాధగా అడిగాడు సీతారామయ్య.

"అందరూ అన్నీ అర్థం చేసుకోగలరనీ, అవగాహన చేసుకోగలరనీ ఎలా అనుకోగలం? అది సరే- నీకు యింకో కొడుకున్నాడుగా...." అని అడిగాడు సాలోచనగా.

"ఆ వున్నాడు లేకేం. వాడికి ఏడాదికో సారే మేము గుర్తొచ్చేది. అదెప్పుడో తెలుసా.... సరిగ్గా పంటలొచ్చేటప్పుడు. సెలవు పెట్టుకుని సరిగ్గా దిగుతాడు పెళ్ళాంతో సహా. ఆ అప్పనీ, యీ అప్పు యుందనీ, రోగమనో, రొష్టనో ఆ పిచ్చి దాన్ని నమ్మించి ఆ వడ్లబాపతు డబ్బంతా పట్టుకుపోయి పెళ్ళాదికి నగలో, నాణ్యాలో చేయిస్తాడు" అన్నాడు.

"అది కాదు. యీసారి నువ్వు మీ ఆవిడతోసహా వెళ్ళి ఒక నెలపాటు హాయిగా అక్కడ వుండి రారాదూ?"

"ఆ చాలా హాయిగా వుండచ్చు? వెళ్ళిన రెండు రోజులు అతి మర్యాదలు చేస్తుంది ఆ కోడలు. మూడో రోజు రోగమని ముసుగుపెట్టి పడుకుంటుంది. యిక మా పిచ్చిది ఆవిడకూ, పిల్లలకూ సకలోపచారాలూ చెయ్యాలి. ఆవిడటు పడకపెట్టగానే మా వాడు క్యాంప్ అని బయలుదేరుతాడు. ఇక యింటి ఖర్చు, డాక్టరు ఖర్చు. వొద్దులే నాయనా అవన్నీ ఎందుకు? నా ప్రాణంమీదికి నాలుగు యింటికన్నుల తగలెయ్యరా. లేకపోతే అసలు కొంపకే పోకుండా ఏ సన్యాసుల్లోనో కలుస్తాను. ఏ ముఖం పెట్టుకుని యింటికి" అన్నాడు సీతారామయ్య.

"అరేయ్ నువ్వు కాసేపు వాగకుండా కూర్చో. నేను దీనికి ఏదో పరిష్కారం ఆలోచిస్తాను" అన్నాడు బాలకృష్ణగారు.

"ఆలోచనా వద్దూ, పాలోచనా వద్దు,

నా మాట విని" అంటుండగా, "అరేయ్ డాక్టర్ని నేనా, నువ్వా? నోరు మూసుకుని ముందు నాకీ విషయం చెప్పు. నీకు ఎరన్డ్ లీవ్ ఏమన్నా క్రెడిట్‌లో వుందా?" అని అడిగాడాయన.

"ఆ. చచ్చినంత వుంది. ఆ లీవే ఒక నెల సరెండర్ చేసుకుందామనుకుంటున్నాను. ఎందుకేమిటి?" అన్నాడు.

"హాయిగా సెలవుంటే వాడుకోక సరెండర్ ఏమిట్రా?"

"ఎందుకేమిటి. చచ్చినంత సంసారం మొయ్యొద్దూ. నేనూ నా భార్యా, కొడుకూ, కోడలూ, వాళ్ళ పిల్లలు. వీళ్ళు కాక కోడలు గృహప్రవేశంతో పాటే ప్రవేశం చేశారు. ఆవిడ తమ్ముళ్ళిద్దరు చదువులంటూ, దీనికి తోడు పిల్లల పెళ్ళిళ్ళకు చేసిన అప్పులు. నాయనా సుఖాలకు సన్యాసంగానీ ఈ సంసార జంజాటం నుంచి సన్యాసం పుచ్చుకుంటే ఎవరూ వొప్పరు. చచ్చేదాకా యిది మొయ్యాల్సిందే".

"మీ పెద్దవాడు ఉద్యోగం చేస్తున్నాడు కదురా. నువ్వొక్కడివే తంటాలుపడట మేమిట్రా?"

"ఆ. ఆ. అందుకే నెలకో, రెణ్ణెల్లకో తోచినప్పుడు నూరో, నూట యాభయ్యో ముష్టి పడేస్తుంటాడు. దానికావిడ రెండొందల సార్లు దెప్పుతుంది డబ్బిచ్చి అన్నం తింటున్నామని".

"పోనీ వాళ్ళను వేరు పెట్టక పోయ్యావా?"

"వాళ్ళు కదులుతారేమిటి! నా మొఖాన యింత ముష్టిపడేసి ప్రతి నెలా పెళ్ళానికీ, పిల్లలకూ కోరిన బట్టలు, నగలు, నాట్యాలూ చేయించుకోవచ్చుగా. పైగా మా పిచ్చి మొహంది వుందిగా. 'కాలూ, చెయ్యీ ఆడనప్పుడు మనల్ని ఎవరు చూస్తారండి వాళ్ళేగా' అంటుంది కాలూ, చెయ్యీ ఆడకుండా మనకు వాళ్ళతో అవసరం వచ్చినప్పుడే చప్పున ట్రాన్స్‌ఫర్ చేయించుకుని గప్‌చుప్‌గా తప్పుకుంటారే వాళ్ళు.... అంటే దాని తలకెక్కదు. ఆ గొడవంతా ఎందుకులే యిప్పుడు. నాకు పరిష్కారం చెప్పి చంపు."

"నన్ను క్షణంపాటు నిదానంగా ఆలోచించుకోనీరా....అన్నట్టు మీ ఆవిడ నువ్వు చెప్పినట్టు చేస్తుందా?" అని అడిగాడు.

"నాకు జీవితంలో లభించిన ఒకే ఒక్క వరం నా భార్య. వెనకటి ఆ సీతామ్మవారిని రామచంద్రుడే అడవికి రావద్దంటే 'మా నాయన నువ్వు మహా వీరుడవనుకుని పిల్లనిచ్చాడు' అంటూ దెప్పి ఆయన మాట వినకుండా అడవికి వెళ్ళిందట. కానీ మా జానకిది మాత్రం పాపం ఎన్ని సంవత్సరాలు ఎక్కడ పడుండమంటే అక్కడ మారు మాట్లాడకుండా వుండేది పాపం" అన్నాడు.

"రైట్—అయితే నీకో అద్భుతమైన మందు చెబుతాను. ఇదుగో యీ కాగితం, కలం తీసుకో" అన్నారు డాక్టరుగారు.

"ఎందుకూ ఆత్మహత్య చేసుకుంటున్నాను, ఎవరూ బాధ్యులు కారని రాయడానికా?"

"ఏడ్చావులే. బోడిజోకూ నువ్వూనూ.


గ్రామ్స్ : SUNRISE

ఫోన్ : 3448
PBX 1 + 3 Lines




# హోటల్ రవిరాజ్

(ఎయిర్ కండిషన్డ్)

మహాత్మాగాంధీ రోడ్డు, విజయనగరం-531201

* ఆధునిక వసతులతో సింగిల్, డబుల్ & డీలక్స్ రూమ్‌లు
* మర్యాద, మన్ననలతో 24 గంటలు రూమ్ సర్వీస్
* రుచికరమైన భోజన ఫలహారాలకు రెస్టారెంట్ సదుపాయం కలదు
* విశాలమైన కాన్ఫరెన్స్ హాలుకూడ కలదు.



మీ ఆవిడకు వుత్తరం రాయి ముందు" అన్నాడాయన.

"మా ఆవిడకు వుత్తరం ఏమిట్రా?"

"ఎందుకా, అర్జంటుగా హనీమూన్ ట్రిప్‌కు బయలుదేరమని వుత్తరం.... కాదు ప్రేమలేఖ. తెలిసిందా" అన్నాడు.

"ఒరేయ్, నా కథంతా విన్న తర్వాత నీకు మతిపోయినట్లుందేరా. లేకపోతే యీవయస్సులో హనీమూన్ ఏమిటి. ప్రేమలేఖ లేమిటి. నాకలాంటివి రాయడమే రాదు."

"ఓరి బుద్ధావతారం' పెళ్ళానికి ప్రేమలేఖ రాయడం చేతకాదన్న వాడికి నువ్వు అడుగుతున్న యింజక్షన్లు నేను యివ్వాల్సిన పనేలేదు. మాట్లాడకుండా ఆ కాగితం తీసుకొని వుత్తరం రాయి" అన్నారు డాక్టరుగారు.

"నిజంగానే నేనెప్పుడూ మా ఆవిడకు ఉత్తరం రాయలేదురా. అది పుట్టింటికి వెళ్ళినప్పుడు మా అమ్మ వున్నంతకాలం ఆవిడే రాసేది వియ్యంకురాలికి వుత్తరాలు. ఆవిడ పొయ్యాక యిది పుట్టింటికి వెళ్ళే అవకాశమే లేదు" అన్నాడు బిక్క మొగంతో సీతారామయ్య.

"సరే పోనీ. యిదివరలో రాయకపోతే యిప్పుడు రాయి."

"అదే. ఏమిటి రాయాలనికదూ అడుగుతున్నాను."

"ఏమిటా, నా ఆరోగ్యం సరిగ్గా లేదు. డాక్టరు రెండు నెలలు మందులు వాడాలి. విశ్రాంతి కావాలన్నాడు. కొంతకాలం పరిచర్యలకు మనిషి దగ్గరుండాలట. కనుక నువ్వు వెంటనే మా బాలకృష్ణ తో బాటు బయలుదేరిరా. అని రాయి. సరేనా!"

"అది కాదురా బాలూ నేనెక్కడికి పోతానురా కాట్లోకి?"

"కాట్లోకి కాదు. ఏట్లోకి కాదు. రోగిగా నా దగ్గరకు వచ్చావు. నేను ఏ ట్రీట్‌మెంట్ చెబితే అది చెయ్యాల్సిందే. రేపు రెండు నెలలు ఎరన్డ్ లీవ్ పెట్టు. ఈ రాత్రికి యిక్కడే వుండిపో. రేపు రాత్రికి చీరాల దగ్గర వాడ్రేవులో మా పెద్దవాడున్నాడు. పెద్ద యిల్లు. మేడమీద రెండు గదులు ఖాళీగానే వున్నాయి. మా కొడుకూ, కోడలూ అర్థం చేసుకుంటారులే. నేను ఉత్తరం వ్రాసిస్తాను. అక్కడ కొన్నాళ్ళపాటు హాయిగా వుండిరా" అంటుండగా ఫోన్ రింగ్ అయింది.

బాలకృష్ణగారు ఫోను అందుకుని మాట్లాడిన తర్వాత లేస్తూ, "ఇదుగో కాగితం, కలం. నువ్వుత్తరం రాస్తుండు ఈ లోపల పేషెంటుకు సీరియస్‌గా వుందిట ఒకసారి చూసొస్తాను. కిందికి దిగకు. యిక్కడికే కాఫీ పంపమని చెప్పి వెళ్తాను యింట్లో వాళ్ళకు" అని చెప్పి వెళ్ళాడాయన.

సీతారామయ్యకు ఆ వుత్తరం ఎలా మొదలుపెట్టాలో తెలియలేదు. 'ప్రియమైన జానీ' అన్నాడు, ఎవరన్నా చూస్తారేమోనని అది చించేసి 'ప్రియమైన జానకీ' అన్నాడు. అది కోడలి చేతిలో పడితే మళ్ళీ అపహాస్యమవుతుందని చివరికి, చి॥ల॥సౌ॥ జానకికి అంటూ సంబోధించి మూడు ముక్కలు రాసేశాడు సీతారామయ్య.

* * *

రెండు రోజుల తర్వాత వాడ్రేవులో మేడమేద గదిలో హాయిగా పడుకుని విశ్రాంతి తీసుకుంటున్న సీతారామయ్యకు పెద్ద సందేహం వచ్చింది. కొంపదీసి ఆ వుత్తరం చదివాక లబోదిబోమని ఏడుస్తూ పతిపోలేదుగదా యీ పిచ్చిది అనిపించింది. లేకపోతే అదిపొరబాటున కొడుకూ, కోడలూ చేతిలో పడి వాళ్ళు బయలుదేరి వస్తే?....

అతడికి గుండెలు దడ దడ లాడినయి. అలాగే రావటం జరిగితే యిక తనకు సన్యాసమే శరణ్యం అనుకుంటుంటే దూరంగా ఎక్కడో భజనచేస్తూ విన్పించింది. రేపటి నుంచి సాయంత్రం పూట కాస్త ఆ భజనలూ, పూజలూ వగైరాలకు వెళ్ళాలి అనుకుంటుండగా మెట్లమీద అడుగుల చప్పుడయింది. డాక్టర్ బాలకృష్ణ వెంట లోపలికి వచ్చింది జానకి.

"అమ్మా, చూశావా. మీ ఆయనకు ఏమీ ఫర్వాలేదన్నానా. యిదుగో నీ పరిచర్యలతో యిక పూర్తిగా స్వస్థత చేకూరాలి. ఇది మనిల్లే, బిడియపడాల్సిన పనిలేదు. నేను వారానికోసారి వచ్చి చూసిపోతుంటాను. సరేనా. ఇదుగో యీమాత్రలు వాడండి. వాడికొచ్చిన భయమేమీ లేదు. నువ్వయితే వాడి మనసుకి కష్టం కలక్కుండా వాడడిగిన పరిచర్యలన్నీ చెయ్యి. నే వస్తాను. మళ్ళీ బస్సుకు వెళ్ళిపోవాలి" అనేసి వెళ్ళిపొయ్యాడు డాక్టరుగారు.

"అమ్మ. ఎంత గాభరాపడిపొయ్యానండి. మళ్ళీ మిమ్మల్నిలా చూస్తానా. చూడనా అని"-అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది జానకి ఆ మంచం కాళ్ళకట్ట దగ్గర కూలబడుతూ.

"నువ్వుండగా నాకేం భయమే పిచ్చిదానా. లే. ఆ తలుపులేసి వచ్చి కాళ్ళు పిసుకు" అన్నాడు.

అతడికి యిది బాలకృష్ణ అరేంజి చేసిన హనీమూనే మనకు అని చెబుదామనిపించింది కానీ, అదేం రోగమో అని హడలిపోతుందేమో యీ పిచ్చి మాలోకం అనుకుని వూరుకుండిపొయ్యాడు పాపం సీతారామయ్య.